సాక్షి

శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం । 23 । జూలై । 2025



చీనీ టన్ను రూ.16 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.16 వేలు పలికాయి.



టమాట కిలో రూ.40

అనంతపురం కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టం రూ.40, కనిష్టం రూ.30, సరాసరి రూ.20 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



గరిష్టం/కనిష్టం

30.1°/22.0°

జిల్లా అంతటా మంగళవారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

ఖాద్రీశుడి ఆర్జిత కల్యాణం.. భక్తులకు అవకాశం



ప్రత్యేక అలంకరణలో ఖాద్రీశుడు

కదిరి టౌన్‌: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణం చేయించాలనుకునే భక్తులకు ఆలయ పాలక మండలి అవకాశం కల్పిస్తోంది. శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని దాదాపు 17 రోజుల పాటు నిర్వహించే ఆర్జిత కల్యాణోత్సవాలను భక్తుల ఆధ్వర్యంలో నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేసింది. ఆసక్తి కలిగిన భక్తులు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని ఆలయ ఈఓ వెండిదండి శ్రీనివాసరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రావణమాసం శుక్ల పాఢ్యమి (ఈనెల 25వ తేదీ) నుంచి ఆగస్టు 25వ తేదీ వరకు కల్యాణోత్సవాలు జరుగుతాయని వెల్లడించారు. కల్యాణం నిర్వహించే తేదీల్లో రోజుకు 5 టికెట్లు మాత్రమే జారీ చేస్తామన్నారు. ఒక్కో టిక్కెట్‌ ధర రూ.6,500 ఉంటుందని, ఒక టిక్కెట్‌పై ఐదుగురికి మాత్రమే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈనెల 25, 27, 30, 31 తేదీల్లో, ఆగస్టు 3, 4, 5, 10, 11, 12, 13, 18, 19, 20, 21, 24, 25 తేదీల్లో మాత్రమే శ్రీవారి కల్యాణోత్సవాలు ఉంటాయన్నారు. ఆయా రోజుల్లో ఉదయం 10.30 గంటల నుంచి శ్రీస్వామి వారి ఆర్జిత కల్యాణోత్సవం ప్రారంభమవుతుందని ఈఓ పేర్కొన్నారు.

ఏడు మండలాల్లో వర్షం

పుట్టపర్తి అర్బన్‌: తుపాను ప్రభావంతో జిల్లాలో మూడో రోజు మంగళవారం కూడా జల్లులు కురిశాయి. ఇక సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకూ 7 మండలాల పరిధిలో వర్షం కురిసినట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. తాడిమర్రి మండలంలో 10.2 మి.మీ, ధర్మవరం 5.2, బత్తలపల్లి 2.4, ముదిగుబ్బ 2.2, ఎన్‌పీ కుంట 2.0, తలుపుల 1.6, కదిరి మండలంలో 1.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వెల్లడించారు. ఖరీఫ్‌ పంటలు సాగు చేసిన రైతులు కొన్ని రోజులుగా వానదేవుడికి మొరపెట్టుకుంటున్నారు. మూడు రోజులుగా ఆకాశం మేఘావృతమవుతున్నా... తుంపర్లతోనే సరిపెడుతుండటంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఖరీఫ్‌ సీజన్‌లో సరైన వర్షం లేక రైతులు లక్షలాది ఎకరాల్లో ఇంకా విత్తనం వేయలేదు. ఇక అరకొర సాగు చేసిన పంటకు నెలన్నర నుంచి నీరులేక పోవడంతో ఇబ్బందికరంగా మారిందని రైతులు వాపోతున్నారు.

జిల్లాకు చేరుకున్న కృష్ణా జలాలు



వజ్రకరూరు మండలం ఛాయపురం వద్ద ప్రవహిస్తున్న కృష్ణా జలాలు

వజ్రకరూరు/ఉరవకొండ: కృష్ణా జలాలు అనంతపురం జిల్లాలోకి ప్రవేశించాయి. ఈ నెల 17న కర్నూలు జిల్లా మాల్యాల వద్ద శ్రీశైలం జలాశయం బ్యాక్‌వాటర్‌ నుంచి కృష్ణా జలాలను సీఎం చంద్రబాబు విడుదల చేయగా.. అధికారులు హంద్రీ–నీవా కాలువకు నీటి పంపింగ్‌కు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలోనే మంగళవారం ఉదయం కర్నూలు జిల్లాను దాటుకుని జిల్లాలోని వజ్రకరూరు మండలం ఛాయపురం వద్ద 134 కిలోమీటరు వద్దకు చేరుకున్నాయి. హంద్రీ–నీవా చీఫ్‌ ఇంజినీర్‌ నాగరాజు, ఇతర అధికారులు, గ్రామస్తులతో కలిసి జలహారతి ఇచ్చారు. రాగులపాడు లిఫ్ట్‌ వద్ద నీటిని పంపింగ్‌ చేసి జీడిపల్లి రిజర్వాయర్‌కు పంపనున్నారు. కార్యక్రమంలో ఎస్‌ఈ రాజాస్వరూప్‌, ఈఈ శ్రీనివాస్‌నాయక్‌, డీఈఈ రమణ, ఏఈ సురేష్‌నాయక్‌, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

గురుకులాల్లో అందుబాటులో ఇంటర్‌ సీట్లు

అనంతపురం ఎడ్యుకేషన్‌: ఉమ్మడి జిల్లాలోని ఉరవకొండ, బ్రహ్మసముద్రం, నల్లమాడలోని అంబేడ్కర్‌ గురుకుల పాఠశాలల్లో ఇంటర్‌ హెచ్‌ఈసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో మొదటి సంవత్సరం (బాలికలకు మాత్రమే) ప్రవేశాలకు సీట్లు అందుబాటులో ఉన్నాయని గురుకుల పాఠశాలల ఉమ్మడి జిల్లా సమన్వయ అధికారి కె.జయలక్ష్మి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2024–25 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థినులు మాత్రమే అర్హులన్నారు. ఆసక్తిగల విద్యార్థినులు ఒరిజినల్‌ సర్టిఫికెట్లతో ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లను సంప్రదించాలని కోరారు.



- పుట్టపర్తి గోవిందపేటకు చెందిన ఓ వ్యాపారి కార్లు కొని అమ్ముతుంటాడు. ఢిల్లీ, కర్ణాటక, హరియాణా రాష్ట్రాలకు చెందిన పాత వాహనాల ఫొటోలు వాట్సాప్‌ ద్వారా సేకరించి ఆసక్తి ఉన్న వారికి చూపించి విక్రయిస్తుంటాడు. అమ్మకందారుడు, కొనుగోలుదారుడికి మధ్యవర్తిత్వం చేసినందుకు ఇద్దరి తరపున వాహనం విలువలో రెండు శాతం ఆయనకు ఇవ్వాల్సి ఉంటుంది. ఇలా..ప్రతి నెలా రూ.లక్ష వరకు ఆదాయం ఉంటోందని తెలిపాడు.
- హిందూపురానికి చెందిన శేఖర్‌ ఓ సెకండ్‌ హ్యాండ్‌ కారు కొనాలనుకున్నాడు. సామాజిక మాధ్యమాల్లో వచ్చిన వివరాల ఆధారంగా ఢిల్లీకి వెళ్లి కారు కొనుగోలు చేశాడు. అదే కారు ఇక్కడ కొని ఉంటే కనీసంగా మరో రూ.లక్ష ఎక్కువ చెల్లించాల్సి వచ్చేదని చెబుతున్నాడు.

..ఇలా మన రాష్ట్రంతో పోలిస్తే ఇతర రాష్ట్రాల్లోని సెకండ్‌హ్యాండ్‌ వాహనాలు తక్కువ ధరకే దొరుతుండటంతో జిల్లా వాసులు చాలా మంది అక్కడి నుంచే కొనుగోలు చేస్తున్నారు. అందువల్లే జిల్లాలో ఢిల్లీ, హరియాణా తదితర రాష్ట్రాల వాహనాలు విచ్చల విడిగా కనిపిస్తున్నాయి.

ఉత్తరాది షికారు

- పుట్టపర్తిలో ఢిల్లీ బండ్లు రయ్‌ రయ్‌
- బిహార్‌ రిజిస్ట్రేషన్‌ వాహనాలూ అధికమే
- వాహనాల ధరలు పెరగడంతో పాతవాటిపై ప్రజల మొగ్గు





పుట్టపర్తిలో కనిపిస్తున్న వివిధ రాష్ట్రాల రిజిస్ట్రేషన్‌ వాహనాలు

సాక్షి, పుట్టపర్తి: ఇతర రాష్ట్రాల వాహనాలు పుట్టపర్తిలో రయ్‌ రయ్‌ మంటూ తిరుగుతున్నాయి. ఢిల్లీ, బిహార్‌, హరియాణా, మధ్యప్రదేశ్‌ తదితర ఉత్తరాది వాహనాలతో పాటు ఒడిశా, పుదుచ్చెరి, గోవా, కర్ణాటక రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్‌ చేసిన వాహనాలు పుట్టపర్తిలో ఎక్కువగా కనిపిస్తున్నాయి. అయా రాష్ట్రాల్లో తక్కువ ధరలకు కొనుగోలు చేసి.. ఇక్కడకు తీసుకొస్తున్నారు. కొందరు ఏజెంట్లుగా మారి కన్సల్టెన్సీ నిర్వహిస్తూ.. లాభాలు ఆర్జిస్తున్నారు. రూ.లక్షకు రెండు శాతం కమీషన్‌ తీసుకుంటూ వాహనాలు విక్రయిస్తున్నారు. వినియోగదారుడికి తక్కువ ధరకే వాహనం ఇప్పించడంతో పాటు ఏజెంట్లు కూడా లాభాలు పొందుతున్నారు. ఫలితంగా ఇతర రాష్ట్రాల వాహనాల కొనుగోళ్లు.. అమ్మకాలు ఊపందుకున్నాయి.

ఢిల్లీ వాహనాలకు డిమాండ్‌

సెకండ్‌ హ్యాండ్‌ కార్లు కొనాలనుకునే వారంతా ఎక్కువగా ఢిల్లీ వైపే చూస్తున్నారు. వాట్సాప్‌ గ్రూపుల ద్వారా సెకండ్‌ హ్యాండ్‌ వాహనాల ఫొటోలు, డాక్యుమెంట్లు సరిచూసుకుని.. లావాదేవీలు చేస్తున్నారు. మధ్యవర్తిత్వం చేసిన వారికి.. కమీషన్‌ ఇస్తుండటంతో ఎవరికీ నష్టం రాదు. ఇక పొరుగున ఉన్న కర్ణాటక వాహనాలకూ డిమాండ్‌ ఉంటోంది. కేఏ రిజిస్ట్రేషన్‌ వాహనాల వల్ల జిల్లాలో రవాణాశాఖ అధికారుల నుంచి ఇబ్బందులు ఉండవు. అందువల్ల ఎక్కువ మంది కర్ణాటక నుంచి వాహనాలు కొనేందుకు ఇష్టపడుతున్నారు. పుట్టపర్తి నుంచి బెంగళూరుకు రోజూ సగటున వెయ్యి కార్లు తిరుగుతుండగా... అందులో 70 శాతం కర్ణాటక రిజిస్ట్రేషన్‌ వాహనాలే కావడం విశేషం. అక్కడ ఏజెంట్ల వద్ద కొనుగోలు చేసి క్యాబ్‌ సర్వీసులు నడుపుతుంటారు.

అక్కడ నిషేధం.. ఇక్కడ లాభం

అక్కడ (ఢిల్లీ) పదేళ్లకే వాహనాల సామర్థ్యం ముగుస్తుంది. దీంతో అలాంటి వాహనాలను ఇక్కడ విక్రయిస్తుంటారు. దక్షిణాది రాష్ట్రాల్లో 15 ఏళ్ల వరకు రోడ్డెక్కవచ్చు. దీంతో మరో ఐదేళ్ల పాటు లక్షణంగా వాడుకోవచ్చు. ఇదే అదునుగా ఢిల్లీ, బిహార్‌, హరియాణా రాష్ట్రాల వాహనాలను విరివిగా కొనుగోలు చేస్తున్నారు. ఆయా రాష్ట్రాల్లో తక్కువ ధరలకు కొనుగోలు చేసి.. స్థానికంగా అధిక ధరలకు విక్రయిస్తూ లాభం పొందుతున్నారు. అక్కడ నిషేధించిన వాహనాలు కావడంతో తక్కువ ధరలకే విక్రయిస్తారు. డిమాండ్‌కు అనుగుణంగా ఇక్కడ అధిక ధరలకు అమ్మి లాభాలు పొందుతున్నారు.

ప్రభుత్వ ఉద్యోగులు సైతం

ఎల్లో బోర్డు వాహనాలతో పాటు వైట్‌ బోర్డు వాహనాలు కూడా ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. ఇతర రాష్ట్రాల వాహనాలను క్యాబ్‌ సర్వీసులతో పాటు సొంతంగా కూడా వినియోగిస్తున్న వారి సంఖ్య ఇటీవల జిల్లాలో పెరిగింది. సామాన్యులతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు సైతం ఇతర రాష్ట్రాల వాహనాల వైపు మొగ్గు చూపుతుండటం విశేషం.

డాక్యుమెంట్లు సరి చూసుకోవాలి



ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్‌ అయిన వాహనాలను జిల్లాలు కొని ఇక్కడకు తెచ్చుకుంటున్నారు. అయితే ఒక రాష్ట్రంలో రిజిస్ట్రేషన్‌ వాహనం ఏపీలో తిప్పాలంటే మళ్లీ మన వద్ద ట్యాక్స్‌ కడితే ఏపీ రిజిస్ట్రేషన్‌ చేస్తాం. అలాగే ఒక రాష్ట్రంలో నమోదైన వాహనాలను మరో రాష్ట్రానికి తరలించేందుకు తప్పనిసరిగా రవాణా శాఖ అనుమతి అవసరం. రిజిస్ట్రేషన్‌ పత్రాలు, ఇన్సూరెన్స్‌, వాహన యజమాని చిరునామా ఉన్న వాటినే కొనుగోలు చేయాలి. ఎన్‌ఓసీ (నో అబ్జక్షన్‌ సర్టిఫికెట్‌) ఉన్న వాటిని ఎక్కడైనా విక్రయించవచ్చు. అయితే కొనుగోలు చేసిన తర్వాత వినియోగదారుడి పేరు మీద రిజిస్ట్రేషన్‌ మార్చుకోవాలి.

– ఎస్‌ఎస్‌ కరుణసాగర్‌రెడ్డి, జిల్లా రవాణా శాఖాధికారి

రాజకీయ కుట్రతోనే మిథున్‌ రెడ్డి అరెస్ట్‌



ఎమ్మెల్సీ మంగమ్మ

సాక్షి పుట్టపర్తి: ఎంపీ మిథున్‌ రెడ్డి అరెస్ట్‌ కుట్ర పూరితమైందని ఎమ్మెల్సీ మంగమ్మ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. లేని మద్యం కేసును వైఎస్సార్‌ సీపీ నాయకులకు అంటగడుతున్నారన్నారు. కూటమి సర్కార్‌ రాష్ట్రంలో రెడ్‌ బుక్‌ రాజ్యాంగం అమలు చేస్తోందని, అందులో భాగంగానే ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు బనాయించి వేధిస్తోందని మండిపడ్డారు. ఎన్నికల వేల అలివిగాని హమీలు గుప్పించిన కూటమి నేతలు.. అధికారంలోకి వచ్చాక హామీల అమలు పక్కన పెట్టి...ప్రశ్నించిన వారిపై కక్ష గడుతోందన్నారు. కేవలం వైఎస్సార్‌ సీపీ కేడర్‌ను అణచి వేయడంపైనే కూటమి ప్రభుత్వం ఎక్కువ శ్రద్ధ చూపుతోందన్నారు. ఇలాంటి కుట్రలు, కుతంత్రాలు, అక్రమ అరెస్టులకు వైఎస్సార్‌ సీపీ కార్యకర్తలు, నాయకులెవరూ భయపడబోరన్నారు. రానున్న రోజుల్లోనూ వైఎస్సార్‌ సీపీ ప్రజలకోసం పోరాడుతుందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను తప్పక ఎండగడుతుందని మంగమ్మ అన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గొట్లూరు విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ధర్మవరం రూరల్‌: రాష్ట్రస్థాయి బాల్‌ బ్యాడ్మింటన్‌ సబ్‌ జూనియర్‌, జూనియర్స్‌ పోటీలకు గొట్లూరు జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. సబ్‌ జూనియర్‌ జట్టుకు సాయి జోష్నవి, జయవర్ధన్‌, జూనియర్‌ జట్టుకు వినయ్‌, కమలాక్షి ఎంపికైనట్లు పీడీ రమేష్‌ బాబు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఈ విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు జగన్నాథం, ఉపాధ్యాయులు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో జలధికి పీర్లు



గుండం చుట్టూ తిరుగుతున్న పీర్ల స్వాములు

పుట్టపర్తి టౌన్‌: మున్సిపాలిటీ పరిధిలోని బీడుపల్లి, ఎనుములపల్లి గ్రామాల్లో మంగళవారం పీర్ల జలధి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయమే గుండం వద్ద పొట్టేళ్లను బలిచ్చారు. సాయంత్రం ఉల్లాసంగా అలావ్‌ తొక్కారు. అనంతరం చావిడి ముందున్న గుండం చుట్టూ పీర్ల స్వాములను ప్రదక్షిణలు చేయించి అగ్ని ప్రవేశం చేయించారు. అగ్ని గుండంలోకి భక్తులు కొబ్బరి గిన్నెలు, బెల్లం వేశారు. హిందువులు, ముస్లింలు చక్కెర చదివించారు. అనంతరం అగ్నిగుండం పూడ్చివేసి పీర్లను జలధికి తరలించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ సునీత బందోబస్తు చేపట్టారు.

అచ్చెన్నాయుడు వ్యాఖ్యలపై జనాగ్రహం

ఆడబిడ్డ నిధి అమలు చేయాలంటే ఆంధ్రప్రదేశ్‌ను అమ్మాలి అని మంత్రి అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలపై మహిళా లోకం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 18 ఏళ్లు నిండిన ప్రతి ఆడబిడ్డకు నెలకు రూ.1,800 చొప్పున ఇస్తామని చెప్పిన నేతలు.. ఇప్పుడు మాట ఎందుకు మారుస్తున్నారంటూ ప్రజా సంఘాలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజలు మండిపడుతున్నారు. చేతగానప్పుడు ఎన్నికల వేళ ఎందుకు హామీలిచ్చారంటూ ప్రశ్నిస్తున్నారు. మాట తప్పాలని చూస్తే ఊరుకునేది లేదంటున్నారు. హామీలన్నీ నెరవేర్చాల్సిందేనని డిమాండ్‌ చేస్తున్నారు.

అప్పుల సంగతి అప్పుడు తెలియదా ?.



అధికారం కోసం అలవిగాని హామీలిచ్చే సమయంలో ఆంధ్రప్రదేశ్‌ అప్పుల సంగతి కూటమి నాయకులకు తెలియదా..? ఆడబిడ్డ నిధి పథకం అమలు చేయాలంటే, రాష్ట్రాన్ని అమ్మేయాలని మంత్రి అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించడం సిగ్గుచేటు. ఎన్నికల వేళ ఆడబిడ్డలందరికీ అన్ని పథకాలు అందిస్తామని పలికిన నేతలు, అధికారం చేపట్టగానే అమలు చెయ్యలేమని బహిరంగంగా చెప్పడం వారి దిగజారుడు రాజకీయానికి నిదర్శనం. పూర్తి స్థాయిలో పథకాలు అమలు చేయకున్నా.. ఏడాదికే రూ.లక్ష కోట్లపైబడి అప్పులు ఎందుకు చేశారో రాష్ట్ర ప్రజలకు చెప్పాలి. మరో నాలుగు ఏళ్ల కూటమి పాలన పూర్తి కావాలంటే, రాష్ట్ర ప్రజలపై ఎన్ని రూ.లక్షల కోట్ల అప్పు మోపుతారో తెలియడం లేదు.

– ఉషశ్రీ చరణ్‌, జిల్లా అధ్యక్షురాలు, వైఎస్సార్‌ సీపీ

కూటమి అసలు రంగు బట్టబయలైంది



'సంక్షేమ పథకాలు అమలు చేయాలంటే డబ్బు కావాలి.. ఆడబిడ్డ నిధి పథకం అమలు చేయాలంటే ఆంధ్రప్రదేశ్‌ను అమ్మాలి' అని వ్యాఖ్యానించిన అచ్చెన్నాయుడు మాటలతో కూటమి అసలు రంగు బయటపడింది. చంద్రబాబు డైరెక్షన్‌లో రాజకీయం చేసే కూటమి నేతలు ఎన్నికల వేళ ఇచ్చిన హామీలన్నీ ఇప్పుడు తుంగలో తొక్కుతున్నారు. అందుకే వారి అబద్ధపు హామీలు నమ్మొద్దని వైఎస్సార్‌ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్‌ జగన్‌ హెచ్చరించారు. అదే ఇప్పుడు నిజమైంది. అచ్చెన్నాయుడు వ్యాఖ్యలతో కూటమి సర్కార్‌ ఆడబిడ్డలను మోసం చేసిందని అర్థం అయిపోయింది.

– టీఎన్‌ దీపిక, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, హిందూపురం

జగతి మెచ్చేలా జయంత్యుత్సవం

- సత్యసాయి జయంతి వేడుకలను వైభవంగా నిర్వహిద్దాం
- అక్టోబర్‌ 15 నాటికి ఏర్పాట్లు పూర్తి చేయాలి
- దేశ విదేశాల నుంచి వచ్చే ప్రముఖులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు
- రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్‌
- కలెక్టరేట్‌లో సత్యసాయి శత జయంత్యుత్సవాల ముందస్తు ఏర్పాట్లపై సమీక్ష



సత్యసాయి శత జయంతి వేడుకల ఏర్పాట్లపై సమీక్షిస్తున్న అజయ్‌జైన్‌, చిత్రంలో కలెక్టర్‌ చేతన్‌, ఎస్పీ రత్న

ప్రశాంతి నిలయం: సత్యసాయి బాబా శత జయంత్యుత్సవాన్ని జగతి మెచ్చేలా చేద్దామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌ జైన్‌ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్‌ సమావేశ మందిరంలో కలెక్టర్‌ టీఎస్‌ చేతన్‌తో కలిసి సత్యసాయి శత జయంత్యుత్సవాల ముందస్తు ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. సత్యసాయి శత జయంత్యుత్సవాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించిన నేపథ్యంలో వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అధికారులు సమష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఏర్పాట్లన్నీ అక్టోబర్‌ 15వ తేదీ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. జయంత్యుత్సవాలు ప్రారంభమయ్యాక మామూలు రోజుల్లో రోజూ 10 వేల మంది, ముఖ్యమైన రోజుల్లో 60 వేల నుంచి 70 వేల మంది పాల్గొనే అవకాశం ఉందన్నారు. భక్తుల రాకకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా బెంగళూరు, హైదరాబాద్‌, ఢిల్లీ, చెన్నై వంటి మహానగరాల నుంచి కూడా భక్తులు తరలివస్తారని, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రవాణా ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీరు, పారిశుధ్యం, మొబైల్‌ టాయిలెట్లు, వీధి దీపాలు వంటి ప్రాథమిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. జయంత్యుత్సవాలకు విచ్చేసే భక్తులకు ఇబ్బంది కలగకుండా బెంగళూరు–పుట్టపర్తి రోడ్డు మార్గాన్ని మరమ్మతులు చేయాలన్నారు. కొత్తచెరువు – పెనుకొండ, బ్రాహ్మణపల్లి – ఎనుములపల్లి మార్గాలను యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి చేయాలన్నారు. ఎయిర్‌ పోర్ట్‌ కనెక్టివిటీ ఉండేలా ఇంటర్నల్‌ రింగ్‌రోడ్లు అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని, ట్రాఫిక్‌ మేనేజ్‌మెంట్‌తో పాటు పార్కింగ్‌కు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

అన్ని చర్యలు తీసుకుంటున్నాం

కలెక్టర్‌ టీఎస్‌ చేతన్‌ మాట్లాడుతూ, సత్యసాయి శత జయంత్యుత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఇప్పటికే అధికారులకు సూచనలు జారీ చేశామన్నారు. ట్రాఫిక్‌, మౌలిక సదుపాయాల కల్పన, సెక్యూరిటీ ప్లానింగ్‌కు సంబంధించి అన్ని చర్యలూ తీసుకుంటున్నామన్నారు. ఎస్పీ వి.రత్న మాట్లాడుతూ, భద్రత పరంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అత్యవసర వాహనాలతో పాటు, సీసీటీవీ కెమెరాలు ఏర్పాట్లు చేస్తామన్నారు. కమ్యూనికేషన్‌ కోసం రిపీటర్‌ స్టేషన్‌, పార్కింగ్‌ ప్రాంతాల్లో కెమెరాలు, సైన్‌ బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం సత్యసాయి శత జయత్యుత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించడం సంతోషదాయకమన్నారు. అనంతరం సత్యసాయి శత జయంత్యుత్సవాలకు చేపట్టిన ఏర్పాట్లను జాయింట్‌ కలెక్టర్‌ అభిషేక్‌ కుమార్‌ పవర్‌పాయింట్‌ ప్రెజెంటేషన్‌ ద్వారా ప్రదర్శించారు. సమీక్ష అనంతరం అజయ్‌ జైన్‌, కలెక్టర్‌, ఎస్పీలతో కలసి సత్యసాయి ఎయిర్‌ పోర్ట్‌, వెస్ట్‌గేట్‌ రోడ్డు, ఎన్‌హెచ్‌–342, చిత్రావతి హారతి ఘాట్‌, సత్యసాయి హిల్‌వ్యూ స్టేడియం తదితర ప్రాంతాలను పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ విజయసారథి, సత్యసాయి సెంట్రల్‌ ట్రస్ట్‌ బృందం, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సంగీత కచేరీ నిర్వహిస్తున్న భక్తులు

సాయీ... సర్వమూ నీవేనోయి

ప్రశాంతి నిలయం: సత్యసాయి కీర్తనలతో ప్రశాంతి నిలయం ప్రతిధ్వనించింది. పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన సత్యసాయి గ్లోబల్‌ కౌన్సిల్‌కు చెందిన జోన్‌ –8 దేశాల భక్తులు మంగళవారం సత్యసాయిని కీర్తిస్తూ నిర్వహించిన సంగీత కచేరీ భక్తులను అలరించింది. సాయీ..సర్వమూ నీవేనోయీ అంటూ సత్యసాయిని కీర్తిస్తూ సుమారు గంట పాటు నిర్వహించిన సంగీత కచేరీతో భక్తులు తన్మయత్వానికి లోనయ్యారు. అనంతరం వివిధ దేశాల భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



హారతి ఇస్తున్న భక్తులు



మహాసమాధి చెంత ప్రణమిల్లిన భక్తులు

క్లుప్తంగా

వైభవంగా మస్తానయ్య ఉరుసు



షంషీర్‌ను ఊరేగిస్తున్న దృశ్యం

గుంతకల్లు: స్థానిక పాత గుంతకల్లు ప్రాంతం మస్తానయ్య నామస్మరణతో మార్మోగింది. హజరత్ మస్తాన్‌వలి ఉరుసు ఉత్సవాల్లో భాగంగా అత్యంత కీలకమైన షంషీర్ ఊరేగింపు మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. వేకువజామున పుష్పాలతో అందంగా అలకంరించిన షంషీర్‌ను గుర్రంపై కొలువు దీర్చి మేళాతాళలతో దర్గా నుంచి గణాచారిరెడ్డి కులస్తుల ఇంటికి చేర్చారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం తిరిగి దర్గాకు తీసుకువచ్చారు. వేలాది భక్తులు తరలిరావడంతో పాత గుంతకల్లు జనసంద్రమైంది. ఊరేగింపులో ఎండు కొబ్బరి కాల్చేందుకు భక్తులు ఎగబడ్డారు. చక్కెర చదివింపులు, తులభారాలు, జంతుబలులతో మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం జియారత్ కార్యక్రమంతో మస్తానయ్య ఉరుసు ఉత్సవాలు ముగిస్తాయని వక్ఫ్‌బోర్డు అధికారి రహీం, దర్గా కమిటీ సభ్యులు తెలిపారు.

వరి సాగులో జాగ్రత్తలు పాటించండి

- ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్ డాక్టర్ రామసుబ్బయ్య



వరి నారు తీస్తున్న కూలీలు

పుట్టపర్తి అర్బన్: నారు దశ నుంచి నాటే వరకూ జాగ్రత్తలు తీసుకుంటే వరికి రోగాలు ఆశించకుండా మంచి దిగుబడి వచ్చే అవకాశాలు ఉన్నాయని ఏరువాక కో–ఆర్డినేటర్ డాక్టర్ కె.రామసుబ్బయ్య తెలిపారు. నారు మడి తీయడానికి వారం ముందు సెంటు నారు మడికి 160 గ్రాముల కార్బోఫ్యురాన్ గుళికలు ఇసుకలో కలిపి పలుచగా నీరు ఉంచి చల్లాలన్నారు. నారు పీకిన తరువాత కొనలను తుంచి వేయాలన్నారు. నారు నాటే సమయంలో దుక్కిలోకి 200 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 25 కిలోల పొటాష్, 50 కిలోల యూరియా వేయాలన్నారు. నారు నాటే సమయంలో ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీమీటర్ల కాలి బాటలు తీయాలన్నారు. దీంతో కలుపు సమస్య నివారించుకోవచ్చన్నారు. నాటిన మూడు రోజుల్లోపు ఎకరాకు బుటాక్లోర్ ఒక లీటరును 20 కిలోల ఇసుకలో కలిపి చల్లాలన్నారు.

సకల పాప హరం.. హనుమద్ దర్శనం

ఆధ్యాత్మిక, ఆనందాల సమ్మేళనాల శ్రావణ మాసం శనివారంతో ప్రారంభం కానుంది. నాగుల పంచమి, రాఖీపౌర్ణమి, వరలక్ష్మీవ్రతం, మంగళగౌరి వ్రతం, శ్రీకృష్ణ జన్మాష్టమి, పొలాల అమాస్య తదితర ముఖ్యమైన వ్రతాలు ఈ మాసంలోనే వస్తాయి. మహిమాన్వితమైన శ్రావణ మాసంలో హనుమద్ దర్శనం సకల పాపాలను హరిస్తుందని నమ్మకం. ప్రత్యేకించి వ్యాసరాయలు ప్రతిష్టించిన మూడు హనుమద్ క్షేత్రాలను ఒకే రోజు దర్శించుకుంటే ఎంతటి కష్టమైనా ఇట్టే దూరమవుతుందని భక్తుల విశ్వాసం. దీంతో ఈ శ్రావణ మాసంలో జిల్లాలోని నేమకల్లు, మురడి, కసాపురంలోని హనుమద్ క్షేత్రాల సందర్శనకు భక్తులు పోటెత్తనున్నారు.

- శ్రావణ మాసంలో మూడు ఆలయాలను దర్శించుకుంటే పుణ్యఫలం
- ప్రత్యేక ఏర్పాట్లలో దేవదాయశాఖ అధికారులు
- జిల్లా వ్యాప్తంగా 100 బస్సులు నడిపేలా ఆర్టీసీ కార్యాచరణ
- ఈ నెల 26న తొలి శ్రావణ శనివారం

రాయదుర్గం/బొమ్మనహాళ్/గుంతకల్లు రూరల్: అంజనీ సుతుడిని శ్రావణ మాసంలో దర్శించుకుంటే అన్ని కష్టాలు దూరమవుతాయని భక్తుల నమ్మకం. జిల్లాలో ప్రముఖంగా చెప్పుకునే నేమకల్లు, మురడి, కసాపురం ఆలయాల్లో శ్రావణ మాసంలో హనుమద్ దర్శనానికి చాలా ప్రత్యేకత ఉంది. ఈ మూడు ఆలయాలను ఒకే రోజులో దర్శించుకుంటే అంతా మంచే జరుగుతుందని భక్తుల విశ్వాసం.



నేమకల్లు ఆంజనేయస్వామి



మురడి ఆంజనేయస్వామి



కసాపురం ఆంజనేయస్వామి

భక్తుల పాలిట కొంగుబంగారమై..

జిల్లాలో భక్తుల పాలిట కొంగుబంగారంగా, భక్తజన వరదాయకుడిగా నేమకల్లు, మురడి, కసాపురంలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయాలు విరాజిల్లుతున్నాయి. క్రీ.శ. 15వ శతాబ్దంలో వ్యాసరాయమహర్షి ఒకే రోజున ఈ ఆలయాల్లో విగ్రహాలను ప్రతిష్టించినట్లు చరిత్ర తెలుపుతోంది. శ్రావణ మాసంలో వచ్చే మంగళ, శని వారాల్లో ఈ మూడు ఆలయాలను దర్శించుకుంటే కోరికలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. ఈ నెల 26న వచ్చే తొలి శ్రావణ శనివారం నుంచి నేమకల్లు, మురడి, కసాపురం ఆలయాల్లో శ్రావణ మాస ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ప్రత్యేక పూజలు, భజనలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు, రథోత్సవాలతో ఆలయాల్లో సందడి నెలకొననుంది. ఈ నేపథ్యంలో మూడు ఆలయాలను సర్వాంగ సుందరంగా అలకరించారు. భక్తుల సౌకర్యార్థం బారికేడ్లు, వసతి గృహాలు సిద్ధం చేస్తున్నారు. ఈ నెల 26, ఆగస్టు 2, 9, 16, 23వ తేదీల్లో వచ్చే శనివారాలు, ఈ నెల 29, ఆగస్టు 5, 12, 19వ తేదీల్లో వచ్చే మంగళవారాల్లో మూడు ఆలయాలను సందర్శించి మొక్కులు తీర్చుకునేందుకు భక్తలు పోటెత్తుతుంటారు.

ఆలయాల విశేషం

జాతక దోషంతో సింహాసనం కోల్పోయిన శ్రీకృష్ణదేవరాయలు.. ఆ దోషం తొలగిపోయేందుకు 732 ఆంజనేయ స్వామి విగ్రహాలను ప్రతిష్టించాలని వ్యాసరాయలు సూచించినట్లు సమాచారం. ఇందులో భాగంగానే ముందుగా హంపీలో యంత్రోధారక ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్టించినట్లు చరిత్ర చెబుతోంది. అనంతరం పెనుకొండ వద్ద 108 ఆంజనేయస్వామి విగ్రహాలను ప్రతిష్టించారు. చివరకు నేమకల్లు, మురడి, కసాపురంలో ఆంజనేయస్వామి విగ్రహాలను ప్రతిష్టించే సమయంలో వ్యాసరాయ మహర్షి దివ్య దృష్టితో విష్ణుమూర్తి వామన రూపంలో వచ్చి మూడు అడుగుల స్థలాన్ని తీసుకున్న ప్రాంతాలు ఇవేనని గుర్తించి, మూలవిరాట్‌లకు ప్రాణప్రతిష్ట గావించారు. శ్రావణ మాసంలో ఈ మూడు ఆలయాలను ఒకే రోజు శ్రీకృష్ణదేవరాయలు దర్శించుకోవడంతో జాతక దోషం తొలిగిపోయింది. అప్పటి నుంచి ఈ మూడు ఆలయాలను శ్రావణ మాసంలో ఒకే రోజు దర్శించుకుంటే ఎంతటి కష్టమైనా తొలగిపోతుందని భక్తులు విశ్వసిస్తూ వస్తున్నారు.

ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

శ్రావణమాసంలో ఒకే రోజు మూడు ఆలయాలను దర్శించుకునేలా ఉమ్మడి జిల్లాలోని అన్ని డిపోల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతోంది. ప్రతి శని, మంగళవారాల్లో అనంతపురం జిల్లాలోని 7 ఆర్టీసీ డిపోల నుంచి దాదాపు 100 బస్సులు నడిపేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. అలాగే శ్రీసత్యసాయి జిల్లాలోని ఆరు డిపోల నుంచి కూడా ప్రత్యేక బస్సులను నడపనున్నారు. కనీసం 50 మంది భక్తులు ఏకతాటిపైకి వచ్చి మూడు ఆలయాల సందర్శనకు ముందుకు వస్తే వారు కోరుకున్న ప్రాంతానికి ప్రత్యేకంగా బస్సును పంపేందుకు ఆర్టీసీ అధికారులు సిద్ధంగా ఉన్నారు.

ప్రతి శనివారం ప్రాకారోత్సవం

ఉత్సవాల్లో భాగంగా ఈనెల 26వ తేదీన మొదటి శనివారం కసాపురంలో స్వామివారిని వజ్రకవచంతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తారు. సాయంత్రం సీతారామచంద్ర లక్ష్మణ సహిత ఆంజనేయస్వామి వార్లను శేషవాహనంపై కొలువుదీర్చి ఆలయ పురవీధుల్లో ప్రాకారోత్సవం నిర్వహిస్తారు. అదేవిధంగా ఆగస్టు 2వ తేదీ రెండో శనివారం ఉత్సవమూర్తులను హనుమద్ వాహనంపై, ఆగస్టు 9 మూడో శనివారం గజ వాహనంపై, ఆగస్టు 16 నాల్గవ శనివారం గరుడ వాహనంపై, ఆగస్టు 23 ఐదో శనివారం ఒంటె వాహనంపై స్వామివారిని కొలువుదీర్చి ఆలయ పురవీధుల్లో ప్రాకారోత్సవం నిర్వహిస్తారు. శ్రావణమాసంలో వచ్చే నాలుగు మంగళవారాలు కూడా ఉత్సవమూర్తులను వెండిరథంలో కొలువుదీర్చి ప్రాకారోత్సవం నిర్వహిస్తారు.

ఏర్పాట్లు పూర్తి..



ఆలయంలో నెల రోజుల పాటు వైభవంగా జరిగే శ్రావణమాస ఉత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేశాం. స్వామివారి దర్శనార్థం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నాం. భక్తుల కోసం గుంతకల్లు రైల్వే స్టేషన్, బస్టాండ్ నుంచి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడుపుతున్నారు.

– కె.వాణి, ఆలయ ఈఓ, కసాపురం

ఆలయాల్లో ప్రత్యేక సౌకర్యాలు



ఈ ఏడాది శ్రావణ మాసంలో భక్తుల సంఖ్య అధికంగానే ఉంటుందని ముందస్తుగా అంచనాకు వచ్చాం. ఇందుకు తగినట్లుగానే భద్రత, సౌకర్యాలు కల్పించాం. వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాన్ని కేటాయించాం. శని, మంగళవారాల్లో అన్నదానం లాంటి కార్యక్రమాలు ఉంటాయి.

– నరసింహారెడ్డి, ఈఓ, రాయదుర్గం

అప్పులు తీర్చలేక చేనేత కార్మికుడి ఆత్మహత్య

ధర్మవరం అర్బన్: అప్పులు తీర్చే మార్గం కానరాక ఓ చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. ధర్మవరంలోని ఇందిరమ్మ కాలనీలో నివాసముంటున్న లక్ష్మీప్రసాద్(39)కు భార్య కుసుమ, ఓ కుమార్తె ఉన్నారు. చేనేత పనులతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. కొన్నేళ్లుగా మద్యానికి బానిసైన లక్ష్మీప్రసాద్.. సక్రమంగా పనికి పోకుండా కుటుంబ పోషణకు ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పులు చేశాడు. ఈ క్రమంలో అప్పులు తీర్చే మార్గం కానరాక మనోవేదనకు లోనైన ఆయన సోమవారం రాత్రి ఇంట్లో తాడుతో ఉరి చేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మూడురోజుల క్రితం ఆడబిడ్డకు అనారోగ్యంగా ఉండటంతో అనంతపురం వెళ్లిన భార్య కుసుమ మంగళవారం ఫోన్ చేసినా భర్త ఎంతసేపటికి లిఫ్ట్ చేయకపోవడంతో వెంటనే ఇంటి పక్కనున్న గురుమూర్తికి ఫోన్ చేసి తెలిపింది. దీంతో ఆయన వెళ్లి కిటికీలో నుంచి చూడగా ఉరికి విగతజీవిగా వేలాడుతున్న లక్ష్మీప్రసాద్ కనిపించాడు. విషయాన్ని తెలుసుకున్న కుసుమ వెంటనే తన మామ మస్తానప్పకు ఫోన్ చేయడంతో ఆయన ఇందిరమ్మ కాలనీలోని ఇంటికి వెళ్లి కుమారుడిని ఆస్పత్రికి తరలించాడు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి తండ్రి మస్తానప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు రెండో పట్టణ సీఐ రెడ్డప్ప తెలిపారు.

హెడ్ పోస్టాఫీసులో డిజిటల్ సేవలు

- హిందూపురం పోస్టల్ సూపరింటెండెంట్ విజయకుమార్



కార్యక్రమంలో మాట్లాడుతున్న విజయకుమార్

హిందూపురం: పోస్టల్ నెట్‌వర్క్‌ని ఆధునీకరించి గ్రామీణ ప్రాంతాల్లోనూ డిజిటల్ సేవలు అందుబాటులో తీసుకురానున్నట్లు హిందూపురం పోస్టల్ సూపరింటెండెంట్ యు.విజయకుమార్ తెలిపారు. మంగళవారం హిందూపురంలోని హెడ్‌పోస్టాఫీసులో అడ్వాన్స్‌డ్ పోస్టల్ టెక్నాలజీ–2.0 పోర్టల్‌ను ఆయన ప్రారంభించి, మాట్లాడారు. జిల్లాలోని మొత్తం పోస్టుఫీసులలో ఈ–సేవలను మంగళవారం నుంచి ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకుని పోస్టల్ సేవలను బలోపేతంతో చేయడం ద్వారా వినియోగదారులకు మెరుగైన సేవలు అందుతాయన్నారు. పీఎం విశ్వకర్మ పథకం ద్వారా టూల్ కిట్లను కూడా పోస్టల్ ద్వారా దేశవ్యాప్తంగా పంపిణీ జరుగుతోందని వివరించారు. కార్యక్రమంలో పోస్టల్ అసిస్టెంట్ సూపరిటెండెంట్ మల్లికార్జున, శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్ విమల్ కుమార్, హెడ్ పోస్టుమాస్టర్ మార్కండేయ, బ్యాంకు మేనేజర్ మురళి, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.


చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి



సరస్వతమ్మ (ఫైల్)

గాండ్లపెంట: ఈ నెల 12న దుండగుడి దాడిలో గాయపడిన గాండ్లపెంట మండలం బనాన్‌చెరువుపల్లికి చెందిన ఎం.సరస్వతమ్మ(80) చికిత్సకు స్పందించక మంగళవారం మృతిచెందింది. ఈ మేరకు కుటుంబసభ్యులు తెలిపారు. కాగా, దాడి జరిగిన రోజు తలపై లోతైన గాయాలతో బాధపడుతున్న సరస్వతమ్మను కుటుంబసభ్యులు మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. తొలుత వృద్ధురాలిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారని మృతురాలి అల్లుడు నరసింహారెడ్డి ఈ నెల 16న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన ఎన్‌పీ కుంట ఎస్‌ఐ వలీబాషా.. కదిరి రూరల్ సీఐ నాగేంద్ర పర్యవేక్షణలో లోతైన విచారణ చేపట్టారు. ఆదే గ్రామానికి చెందిన సోమశేఖర్ అనే వ్యక్తి డబ్బు కోసం ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలిపై పట్టపగలే కట్టెతో తలపై దాడి చేసినట్లుగా నిర్ధారణ కావడంతో నిందితుడిని అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

బైక్‌పై విరిగిపడిన చెట్టు కొమ్మ.. వివాహిత మృతి



మృతురాలు అరుణ

గుడిబండ: చెట్టు కొమ్మ విరిగి మీద పడడంతో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న వివాహిత మృతిచెందింది. పోలీసులు తెలిపిన మేరకు.. గుడిబండ మండలం మోరుబాగల్ గ్రామానికి చెందిన అరుణ (32), నాగప్ప దంపతులకు ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. కరికెర గ్రామ సమీపంలో ఉన్న కేజీబీవీలో చదువుకుంటున్న కుమార్తెను చూసేందుకు సోమవారం సాయంత్రం దంపతులు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. రోడ్డుకు ఇరువైపుల ఉన్న చింత చెట్లలోని ఓ చెట్టు కొమ్మ విరిగి ద్విచక్ర వాహనం మీద వెళుతున్న అరుణపై పడింది. తలకు బలమైన గాయం కావడంతో వెంటనే మడకశిరలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక అదేరోజు రాత్రి ఆమె మృతి చెందింది. ఘటనపై ఎస్‌ఐ రాజకుల్లాయప్ప మంగళవారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

‘నాటుసారాపై నిఘా పెంచాలి’

ధర్మవరం అర్బన్: ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తూ కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్న నాటుసారా అడ్డుకట్టకు నిఘా పెంచాలని ప్రొహిబిషన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, పుట్టపర్తి అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నరసింహులు సూచించారు. మంగళవారం ధర్మవరంలోని ఎక్సైజ్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం ఎక్సైజ్ సీఐ చంద్రమణి, ఎస్‌ఐ చాంద్‌బాషా, నాగరాజు, సిబ్బందితో మాట్లాడారు. నాటుసారా నిర్మూలనకు ఎప్పటికప్పుడు దాడులు నిర్వహించాలని సూచించారు. ప్రత్యేకంగా సభలు నిర్వహించి నాటుసారా నిర్మూలనపై ప్రజలను చైతన్య పరచాలన్నారు. నవోదయం కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు.

రాజకీయ దురుద్దేశంతోనే అక్రమ అరెస్ట్



విలేకరుల సమావేశంలో పాల్గొన్న వై.విశ్వేశ్వరరెడ్డి, మక్బుల్ అహ్మద్, తదితరులు

కదిరి: రాజకీయ దురుద్దేశంతోనే రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేసిందని వైఎస్సార్‌సీపీ ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి విమర్శించారు. మంగళవారం ఆయన కదిరిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తమ పార్టీ నాయకులపై తప్పుడు కేసులు పెట్టి, జైలుకు పంపి ప్రభుత్వం శునకానందం పొందుతోందన్నారు. పాలన మరిచి ప్రతిపక్షం గొంతునొక్కే ప్రయత్నం చేస్తే భవిష్యత్‌లో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను చంద్రబాబు పక్కనబెట్టి, అక్రమ అరెస్టులతో డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారని మండిపడ్డారు. సరైన సమయంలో ప్రజలే ఆయనకు తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. లిక్కర్ స్కాం అనేది పూర్తిగా చంద్రబాబు కల్పితమని, ఈ కేసులో అక్రమంగా అరెస్ట్ అయిన మిథున్‌రెడ్డితో పాటు మిగిలిన వారు కూడా కడిగిన ముత్యంలా బయటకు రావడం ఖాయమన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బి.ఎస్.మక్బుల్ అహ్మద్, రాష్ట్ర కార్యదర్శి పూల శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి లోకేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘సూపర్’కు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి

- మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్



సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఎదుట నిరసన తెలుపుతున్న ప్రజారోగ్యవేదిక నాయకులు

అనంతపురం మెడికల్: ఉమ్మడి జిల్లా ప్రజలకు వైద్య సేవలు మరింత మెరుగుపరిచేలా అనంతపురంలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని, ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేసే ఆలోచనను మానుకోవాలని కూటమి ప్రభుత్వాన్ని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, ప్రజారోగ్య వేదిక జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొండయ్య డిమాండ్ చేశారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలంటూ ఆస్పత్రి ఎదుట ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆస్పత్రుల అభివృద్ధిపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ సత్యకుమార్ ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను పీపీపీ పద్ధతిలో నిర్వహించడం సబబు కాదన్నారు. ఆరోగ్యాన్ని హక్కుగా ప్రకటించాలన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఉన్న 8 స్పెషాలిటీ వైద్య సేవలను విస్తృతం చేసేలా వైద్యులు, సిబ్బంది నియామకాలు చేపట్టాలన్నారు. క్రిటికల్ కేర్ యూనిట్‌ను త్వరితగతిన ప్రారంభించాలన్నారు. న్యూరో, కార్డియో, తదితర కేసులను నేరుగా ఇక్కడే అడ్మిట్ చేసుకునే సౌకర్యాన్ని కల్పించాలన్నారు. అనంతరం డిమాండ్లపై సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ప్రజారోగ్యవేదిక జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ప్రసూన, డాక్టర్ వీరభద్రయ్య, ఏజీ రాజమోహన్, సీఐటీయూ, రైతు సంఘం, ఏపీఎంఎస్‌ఆర్‌యూ, పెన్షనర్స్ అసోసియేషన్, హ్యూమన్ రైట్స్ ఫోరం ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

తలుపుల: మండలంలోని ఎనమలదొడ్డివారిపల్లి సమీపంలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ నరసింహుడు తెలిపారు. జూదరుల నుంచి రూ.25,070 నగదు, ఐదు ద్విచక్ర వాహనాలు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

పెద్దిరెడ్డి కుటుంబంపై కక్ష సాధింపు తగదు

- చంద్రబాబుకు రాజకీయ పరాభవం తప్పదు
- వైఎస్సార్‌సీపీ మడకశిర సమన్వయకర్త ఈరలక్కప్ప



మడకశిరలో నిరసన తెలుపుతున్న ఈరలక్కప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు

మడకశిర: మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబంపై కక్ష సాధింపు తగదని సీఎం చంద్రబాబుకు మడకశిర నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప హితవు పలికారు. పద్ధతి మార్చుకోకపోతే రాజకీయ పరాభవం తప్పదని హెచ్చరించారు. ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమ అరెస్ట్‌ను ఖండిస్తూ ఈరలక్కప్ప ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు మంగళవారం మడకశిరలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నల్లబ్యాడ్జీలు ధరించి కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మిథున్‌రెడ్డిని వెంటనే విడుదల చేయాలంటూ గంటపాటు నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఈరలక్కప్ప మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ అరెస్ట్‌లకు వైఎస్సార్‌సీపీ నాయకులు భయపడరన్నారు. అభివృద్ధిని విస్మరించి వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. లేని లిక్కర్ కేసును సృష్టించి, ఎలాంటి సంబంధం లేని ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేయడం దుర్మార్గమన్నారు. కడిగిన ముత్యంలా మిథున్‌రెడ్డి ఈ కేసు నుంచి బయటకు వస్తారన్నారు. చంద్రబాబు హయాంలో జరిగింది లిక్కర్ స్కాం అని తెలిపారు. వైఎస్ జగన్ హయాంలో లిక్కర్ స్కాం జరగకున్నా చంద్రబాబు తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారని విమర్శించారు. రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేయడం మానుకోపోతే ప్రజలు ఎదురు తిరగడం ఖాయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహమూర్తి, మున్సిపల్ మాజీ చైర్మన్ జయరాజ్, ఎంపీపీ సత్యనారాయణరెడ్డి, మండల కన్వీనర్లు రామిరెడ్డి, త్రిలోక్‌నాథ్, పట్టణ అధ్యక్షుడు వాల్మీకి సతీష్‌కుమార్, పార్టీ అనుబంధ కమిటీల అధ్యక్షులు శేషు, మల్లికార్జునగౌడ్, మంజునాథ్, శివన్న, నరసింహ, సికిందర్, మాజీ డైరెక్టర్ నాగరాజు, జిల్లా బీసీ సెల్ కార్యదర్శి శ్రీరాములు, పార్టీ అనుబంధ కమిటీల సభ్యులు అంజలి, నగేష్, గోపి, నాగభూషణ్‌రెడ్డి, రంగనాథ్, సైఫుల్లా, హనుమంతు, మధు తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న కారు

- గాయపడిన గార్మెంట్స్ పరిశ్రమ కార్మికులు

లేపాక్షి: ఆటోను కారు ఢీకొన్న ఘటనలో గార్మెంట్స్ పరిశ్రమలో పనిచేస్తున్న మహిళా కార్మికులు గాయపడ్డారు. వివరాలు.. లేపాక్షి మండలం కొండూరు గ్రామానికి చెందిన 15 మంది మహిళలు గార్మెంట్స్ పరిశ్రమలో కార్మికులుగా పనిచేస్తున్నారు. రోజూ ఆటోలో పరిశ్రమకు వెళ్లి వచ్చేవారు. మంగళవారం విధులు ముగించుకున్న అనంతరం సాయంత్రం ఆటోలో స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. కుర్లపల్లి గ్రామ సమీపంలోకి చేరుకోగానే లేపాక్షి వైపుగా వేగంగా వెళుతున్న కారు ఢీకొంది. ఘటనలో ఆటో రోడ్డు పక్కన ఉన్న పొలాల్లోకి బోల్తాకొట్టింది. ప్రమాదంలో ఐదుగురు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు వెంటనే హిందూపురంలోని ఆస్పత్రికి తరలించారు.

క్షణికావేశం.. బైక్ ధ్వంసం

సాక్షి, పుట్టపర్తి: క్షణికావేశం సుమారు రూ.25వేల మూల్యం చెల్లించేలా చేసింది. ఓ యువకుడు ఆవేశంతో రగిలిపోతూ బైక్‌ను రాళ్లతో ధ్వంసం చేసి నిప్పు పెట్టబోయాడు. గమనించిన స్థానికులు అడ్డుకోవడంతో మంటలు రేగలేదు. అనంతరం పోలీసుల జోక్యంతో తప్పు తెలుసుకుని బైక్ రిపేరీకి అయ్యే ఖర్చు భరిస్తానని అంగీకరించాడు. వివరాలు.. మామిళ్లకుంట క్రాస్‌కు చెందిన తిరుమలేష్.. మంగళవారం ఉదయం పుట్టపర్తి నుంచి ప్యాషన్ ప్రో బైక్‌పై వెళుతూ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సమీపంలో వై–జంక్షన్ వద్దకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న బాలుడి స్కూటర్ పరస్పరం ఢీకొన్నాయి. ఆ సమయంలో తిరుమలేష్ గట్టిగా కేకలు వేయడంతో భయపడిన బాలుడు తన స్కూటర్‌ను వదిలేసి పారిపోయాడు. అప్పటికే ఆవేశంతో రగిలిపోతున్న తిరుమలేష్.. రాళ్లతో స్కూటర్‌ను చిత్తుచిత్తు చేశాడు. విడి భాగాలను చెల్లాచెదురు చేశాడు. నిప్పు పెట్టేందుకు సిద్ధమవుతుండగా స్థానికులు అడ్డుకున్నారు. అంతలోనే పోలీసులు అక్కడకు చేరుకోవడంతో సమస్య సద్దుమణిగింది. కాగా, ఒంగోలుకు చెందిన ఓ కుటుంబం దిన కూలి నిమిత్తం ప్రశాంతి గ్రామ్‌లో నివాసముంటున్నారు. మొహర్రం కావడంతో కుమారుడికి స్కూటర్ ఇచ్చి చికెన్ కోసం పంపించారు. వై–జంక్షన్‌లో ఎదురుగా బైక్ దూసుకురావడంతో అయోమయంలో అటు ఇటు వాహనం తిప్పి కిందపడ్డాడు. అవతలి వ్యక్తి కేకలు వేయడంతో పారిపోయాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు అక్కడకు చేరుకునేలోపు స్కూటర్‌ను సదరు వ్యక్తి ధ్వంసం చేయడంతో ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ధ్వంసమైన వాహనాన్ని తానే రిపేరీ చేయిస్తానని తిరుమలేష్ అంగీకరించడంతో సమస్యకు పరిష్కారం దొరికింది. స్కూటర్ విలువ రూ.20 వేల వరకు ఉండవచ్చునని, ప్రస్తుతం రిపేరీకి రూ.25 వేల వరకు అవుతుందని అంచనా వేసిన స్థానికులు క్షణికావేశం ఎంత పని చేసిందని చర్చించుకున్నారు.



దాడిలో ధ్వంసమైన బైక్